క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ

బద్వేలు అర్బన్ : స్థానిక సబ్ జైలు ఆవరణలోని శ్రీకనకదుర్గాదేవి ఆలయ 19వ వార్షికోత్సవ మహోత్సవాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలోని అమ్మవారి విగ్రహాన్ని సుందరంగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మహాచండీ హోమం చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ జయ ప్రసాద్‌శర్మ, ప్రదీప్‌కుమార్‌శర్మల బ్రహ్మత్వమున నిర్వహించబడిన పూజా కార్యక్రమాల్లో సబ్‌జైలు సూపరింటెండెంట్ పి.శ్రీహరి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పి.చంద్రశేఖర్, డి.సుబ్బరాజ, వి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ

మైదుకూరు : ఏపీ ఎన్జీఓ–2023 క్యాలెండర్‌ను మంగళవారం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మైదుకూరు తాలూకా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు జి.చంద్రమౌళి, కార్యదర్శి మాచనూరు రాఘవయ్య మాట్లాడుతూ ఉద్యోగులు ఏమైనా సర్వీస్ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంఘం కోశాధికారి ఎల్.బాబు, సహ అధ్యక్షుడు రోహిత్‌కుమార్, ఉపాధ్యక్షుడు పీవీవీ ప్రభాకర్, జాయింట్ సెక్రటరీలు సునీల్‌కుమార్, బీజే పద్మావతి, డీఈసీ సభ్యుడు రామగుప్తా పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పోరుమామిళ్ల : అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్, మండల అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వినోద, మేరీలు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు, ఆయాలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, కనీస వేతనం పెంచాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ముత్తుకూరు గ్రామ సచివాలయం సందర్శన



మల్బరీ తోటను పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి

అట్లూరు : మండలంలోని ముత్తుకూరు సచివాలయాన్ని మంగళవారం పట్టుపరిశ్రమ జిల్లా అధికారి శ్రీనివాసరెడ్డి సందర్శించారు. ముత్తుకూరు గ్రామ సచివాలయం పరిధిలోని మల్బరీ తోటను పరిశీలించి రైతులైన శ్రీనివాసులు, వెంకటరమణలకు మల్బరీ సాగుపై, పట్టుపురుగుల పెంపకంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. పట్టుపురుగుల పెంపకం వలన మంచి రాబడి వస్తుందని ఆయన తెలిపారు.

విద్యార్థి జీవితంలో పదో తరగతి మలుపు



విద్యార్థినికి స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి ఒక ముఖ్యమైన మలుపు అని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం మైదుకూరులో గాయత్రి సేవా ట్రస్టు వారు అందించిన టెన్త్ క్లాస్ మెటీరియల్‌ను ఎమ్మెల్యే విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి పునాది అని, దానిని జాగ్రత్తగా వేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానం పొందేందుకు పదో తరగతి నుంచే చక్కటి ప్రణాళికతో చదవాలన్నారు.

సచివాలయ సెక్రటరీపై దాడికి యత్నం

ప్రొద్దుటూరు క్రైం : శ్రీనివాసనగర్‌లోని 10వ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సెక్రటరీ వంశీకృష్ణపై దాడి చేసిన ఘటనలో శ్రీనివాసులుపై టూ టౌన్ పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. కార్యాలయంలోని రికార్డులను చూపించమని అతను పదేపదే అడగడంతో పాటు దాడి చేసే ప్రయత్నం చేసినట్లు వంశీకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఇబ్రహీం తెలిపారు.

బాలిక బరువు కాదు.. బాధ్యత

ప్రొద్దుటూరు క్రైం : ఆడపిల్లలు బరువు కాదని ఒక బాధ్యత అని డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. స్థానిక రెండో వార్డులోని మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ భారతావనిలో మాతృమూర్తిగా పూజ్యనీయ స్థాయిలో మహిళ ఉందని చెప్పారు. బాలబాలికలు ఇద్దరూ సమానమే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని పేర్కొన్నారు. వార్డు కౌన్సిలర్ భారతి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సిర్డ్‌సొసైటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు గీత, హెల్త్ సెక్రటరి రెబక, మహిళా సంరక్షణ కార్యదర్శి యామిని, ఆశా కార్యకర్తలు గంగాభవాని, రమణమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ర్యాలీ

ప్రొద్దుటూరు : స్థానిక గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజీ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వికసిత ఫౌండేషన్, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల వద్ద డాక్టర్ నాగార్జున జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కళాశాలలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, కళాశాల కోఆర్డినేటర్ గౌరీశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడ పిల్లల పట్ల వివక్ష వద్దు

మైదుకూరు : తల్లిదండ్రులు ఆడ పిల్లల పట్ల వివక్ష చూపవద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు. మంగళవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండలంలోని జీవీ సత్రంలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ మగ పిల్లలతోపాటు ఆడ పిల్లలను చదివిస్తే వారు దేశాభివృద్ధిలో భాగస్వాములు అవుతారని తెలిపారు. బాల్య వివాహాల వల్ల ఆడ పిల్ల భవిష్యత్తు దెబ్బతింటోందన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా కార్యదర్శి సుజాత, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను సంరక్షించడం బాధ్యత



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ నాగార్జున



కాశినాయన: నరసాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దువ్వూరు : ఆడ పిల్లలను సంరక్షించడం మనందరి బాధ్యత అని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నీలాపురం గ్రామానికి చెందిన మహిళ ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఈ సందర్భంగా ఆమెకు జనన సర్టిఫికెట్, స్వీట్ ప్యాకెట్ అందించారు. డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ ఆడ పిల్లలను సంరక్షించి చదివించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. లింగ వివక్షచూపకుండా భ్రూణ హత్యలను నివారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

చాపాడు : బాలికలు బాగా చదువుకుని అన్ని రంగాల్లో రాణించాలని మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ పేర్కొన్నారు.

జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రమైన చాపాడులో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. బాలికల బాగా చదువుకోవాలని ఇళ్లలో తల్లిదండ్రులు ఆడ, మగ తేడా లేకుండా చదివించాలన్నారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం బాలికలు వారికి ప్రభుత్వం కల్పించే సేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కస్తూర్బా స్పెషలాఫీసరు నాగలక్ష్మీ, హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బద్వేల్‌లో..

బద్వేలు అర్బన్ : బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే సమాజంలో తమకంటూ ఓ గుర్తింపు పొందవచ్చని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం తొట్టిగారిపల్లె ఆరోగ్య కేంద్రం పరిధిలోని చెన్నంపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో భ్రూణహత్యలు పెరిగిపోతున్నాయని, దీనిని నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివిద్దాం

ప్రతిఒక్కరు ఆడపిల్లలను చదివించాల్సిన బాధ్యత ఉందని శ్రీకృష్ణదేవరాయనగర్ మహిళా సంరక్షణ కార్యదర్శి మీనా పేర్కొన్నారు. బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో కార్యక్రమంలో ఎరుకల పాలెం ప్రాథమిక పాఠశాల, ప్రదీప్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో బాలికల విద్య ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడంతో పాటు భ్రూణ హత్యల నివారణకు కృషి చేయాలని కోరారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

కాశినాయన మండలంలో..

కాశినాయన : జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, పాఠశాల విద్యార్థులు మంగళవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 'పుట్టింటి ప్రాణదీపం, మెట్టింటికి మణిదీపం ఆడపిల్ల' అనే నినాదంతో నరసాపురం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీహెచ్ఓ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆడబిడ్డను రక్షించి వారి చదివించాలన్నారు. బాల్యవివాహాలు పూర్తిగా ఆపాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సుబ్బరాయుడు, పర్యవేక్షకులు బాలయ్య, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్



ఆడ పిల్లకు జన్మనిచ్చిన తల్లికి జనన సర్టిఫికెట్, స్వీట్ ప్యాకెట్ అందిస్తున్న డాక్టర్ సురేష్‌బాబు

ఆడపిల్ల అంటే మరో అమ్మ

బి.కోడూరు : ఆడపిల్ల అంటే మరో అమ్మలా సమాజం భావించాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌లు తెలిపారు. మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బి.కోడూరు ప్రాథమికోన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సమాజంలో బాలికలు వివక్షత, వారి హక్కులు, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆత్మరక్షణ లాంటి అంశాల గురించి వివరించారు. సమాజంలో ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చూడాలని, ఆడపిల్లలు, మగ పిల్లలు అనే వివక్షత తల్లిదండ్రులు చూపరాదన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నరసింహారెడ్డి, సీహెచ్ఓ నాగమణి, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపల్ శ్రీలత, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, రామతీర్థం, ఏఎన్ఎం కుమారి, లక్ష్మిదేవి, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బద్వేల్ అర్బన్: పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం



జీవీ సత్రంలో విద్యార్థుల మానవహారం

వైఎస్ జగన్ పాలనకు విశేష ఆదరణ

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కూనవారిపల్లె గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. రైతులు, మహిళలు, విద్యార్థులు ప్రభుత్వం పట్ల సానుకూలంగా చెబుతుండటంతో ఎమ్మెల్యే సంతృప్తి చెందారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల వారికి సమన్యాయం చేసి సీఎం వైఎస్ జగన్ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. రైతుల సంక్షేమం కోసం ఎంతో కృషిచేస్తున్నారన్నారు. దెబ్బతిన్న పంటలకు ఏ సీజన్‌లో నష్టపోతే అదే సీజన్‌లోనే పరిహారం అందిస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో ఎప్పుడు పరిహారం వస్తుందే తెలిసేది కాదన్నారు. కేసీ కాలువకు రెండు కార్ల నీరువస్తోందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక పోతే ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతుల నుంచి పంట కొనుగోలు చేస్తోందని తెలలిపారు. అలాగే విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. విద్యార్థులకు చక్కటి భోజనం తోపాటు నాడు– నేడుతో మౌలిక వసతులు కల్పించారన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కరీముల్లా, పత్తూరు ఎంపీటీసీ రాముడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్ భూమన సుబ్బారెడ్డి, గంగాధర్‌రెడ్డి, సబ్బారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డి, మున్వర్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సోమిరెడ్డిపల్లె సచివాలయం పరిధిలో ఉన్న గంగిరెడ్డిపల్లె, నరసన్నపల్లె గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు, అధికారులు పాల్గొనాలని కోరారు.

యువత సమాజసేవలో భాగస్వాములు కావాలి

పోరుమామిళ్ల : యువత సమాజసేవలో భాగస్వాములు కావాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణురాలు స్వర్ణలత పిలుపిచ్చారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్ అధ్యక్షతన యువజనోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో విశ్రాంత డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ మార్కారెడ్డి, సామాజిక సేవకులు రాజోలి శ్రీధర్‌రెడ్డి, మదర్ థెరెసా ఫౌండేషన్ చైర్మెన్ రవిప్రకాష్‌రెడ్డి మాట్లాడతూ యువత స్వామి వివేకానందున్ని ఆదర్శంగా తీసుకొని లక్ష్యం వైపు పయనించాలన్నారు. వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి కళాశాలకు కంప్యూటర్ అందజేశారు. స్టెప్ సహకారంతో కేరీర్ గైడెన్స్ పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు, వివేకానంద సాహిత్యం అందచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశరావు, అధ్యాపకులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు, బహుమతులతో విద్యార్థులు

విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని అబ్జర్వర్లు అట్లా నరసింహా రెడ్డి, డీవీ సుబ్బానాయుడు పేర్కొన్నారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు గణితం, సాంఘిక శాస్త్రాల్లో అభ్యసన అభివృద్ధి కార్యక్రమంపై రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఒక పీరియడ్ పాఠ్యాంశం బోధించిన తర్వాత, రెండో పీరియడ్ ప్రాక్టికల్‌గా నేర్చుకోవడానికి విద్యార్థులకు అవకాశం ఇవ్వాలని సూచించారు. గణితం, సాంగిక శస్త్రాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అబ్జర్వర్లు అట్లా నరసింహారెడ్డి, డీవీ సుబ్బానాయుడు

ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్

మైదుకూరు : మైదుకూరులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్టు న్యాయమూర్తి షేక్ ఖాజా మొయినుద్దీన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సూచనల మేరకు లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో అన్ని రకాల రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఖాజామొయినుద్దీన్

వెన్నపూసకు మద్దతుగా ప్రచారం

ప్రొద్దుటూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఎస్వీ మధుసూదన్‌రెడ్డి కోరారు. పట్టణంలోని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం ఉపాధ్యాయులకు లిప్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ మధుసూదన్‌రెడ్డి ఉపాధ్యాయులు, సిబ్బందిని కలిసి వెన్నపూసకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఇతర ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సినీ హీరో బాలకృష్ణ క్షమాపణలు చెప్పాలి

ప్రొద్దుటూరు క్రైం : అక్కినేని నాగేశ్వరరావును అసభ్య పదజాలంతో మాట్లాడిన సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ క్షమాపణలు చెప్పాలని అక్కినేని ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నల్లం రవిశంకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తన సినిమా సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ అహంకారంతో కించపరుస్తూ మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు.

రేపు అక్షరాభ్యాసం

ప్రొద్దుటూరు కల్చరల్ : వసంతపంచమి సందర్భంగా ఈనెల 26న గురువారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని సరస్వతి విద్యామందిరం హైస్కూల్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు హైస్కూల్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక కొవ్వూరు గ్యారేజి సమీపంలో మద్యం విక్రయిస్తున్న పల్లె ప్రశాంత్‌రావు, మైఖేల్, సయ్యద్ ఆలీషేర్, సద్దాంహుస్సేన్‌లను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 25 మద్యం సీసాలతో పాటు మట్కా స్లిప్పులు, రూ.5700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ ఇబ్రహీం తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపించామన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠం సోమిరెడ్డిపల్లె సచివాలయం–1లో మంగళవారం వృద్ధులకు డాక్టర్ వినోద్ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ప్రభుత్వం తరపున ఉచితంగా కంటి అద్దాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రామయ్య, సచివాలయం కన్వీనర్లు జోగయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు సరికాదు

ప్రొద్దుటూరు : విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు, సస్పెండ్లు చేస్తూ మానసికంగా వేధించడం తగదని ఎస్టీయూఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, సుబ్బరాజు యాదవ్ పేర్కొన్నారు. ప్రొద్దుటూరులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు, పాఠశాలకు సంబంధించిన వివరాలను సెల్‌ఫోన్లలోని యాప్‌ల ద్వారా నమోదు చేయడం కార్యక్రమని, కానీ తరగతి గదిలో సెల్‌ఫోన్ వాడకూడదని చెప్పడం వింతగా ఉందన్నారు. పాఠశాలలను సందర్శించినప్పుడు అధికారులు ఉపాధ్యాయులు చేసే బోధనలో లోపాలు సరిచేసి మార్గదర్శకత్వం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఎస్టీఫ్ రాష్ట్ర నాయకులు రామలక్ష్మిరెడ్డి, రామ సుభాష్‌రెడ్డి, రామ్మోహన్, ఉపాధ్యాయులు రాధా లక్ష్మి, లక్ష్మీనారాయణమ్మ, రజియా, జాకీర్, రెడ్డి పవన్, గంగన్న, రామలక్ష్మయ్య, రమణ పాల్గొన్నారు.

మోసానికి అద్దం పట్టిన బాబు పాలన

- జగన్ పాలనలో నిబద్ధత
- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రాచమల్లు

రాజుపాళెం : గత ప్రభుత్వంలో పేద వారికి పక్కా గృహాలు మంజూరు చేసి వారికి రాగి పైసా కూడా ఇవ్వకుండా చంద్రబాబు మోసం చేశాడని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ధ్వజమెత్తారు. జగనన్న పాలనలో ఇళ్లు కట్టుకున్న పేదవారికి బిల్లులు చెల్లించి నిబద్ధత చాటుకున్నాడని ఎమ్మెల్యే అన్నారు. మండలంలో టంగుటూరు గ్రామంలో మూడవ రోజైన మంగళవారం వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ముడియం గౌతమ్‌రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చంద్రబాబు పాలనలో మంజూరు చేసిన ఇళ్లు, జగనన్న ప్రభుత్వంలో మంజూరు చేసిన పక్కా గృహాల బిల్లుల మంజూరులో తేడా చూపించారు. చంద్రబాబు ప్రభుత్వంలో మంజూరు చేసిన పక్కా గృహాలకు బిల్లులు ఇవ్వకుండా మోసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని బీసీ కాలనీలో సీసీ రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలని ఎమ్మెల్యేను పలువురు మహిళలు కోరగా గత ప్రభుత్వంలో అభివృద్ధి చెందలేదని, ఇప్పటి నుంచి అభివృద్ధిని చూస్తారన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, సోమేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గోనా వెంకటసుబ్బారెడ్డి, రామునపల్లి దస్తగిరి, రంగారెడ్డి, ఎంపీడీఓ సయ్యదున్నీసా, డిప్యూటీ తహసీల్దార్ వెంకటసాయినాథరెడ్డి, కౌన్సిలర్ వంశీధర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, ఆయా గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



రాజుపాళెం: టంగుటూరులో దస్తగిరి ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

నేడు రాజుపాళెంలో గడపగడపకు మన ప్రభుత్వం

రాజుపాళెం : మండల కేంద్రమైన రాజుపాళెం గ్రామంలో బుధవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలూరు ఇంద్రసేనారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పాల్గొంటారని, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

ఇళ్ల నిర్మాణాల్లో లక్ష్యాన్ని చేరుకోవాలి

గోపవరం : జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజు అధికారులను, సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం గోపవరం ఎస్సీ కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని స్వయంగా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వం నుంచి ఎప్పటికప్పుడు మెటీరియల్‌తో పాటు బిల్లులను చెల్లిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో 428 ఇళ్లు మంజూరు కాగా మార్చి 23వ తేదీన సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమానికి మొదటి విడతలో 142 ఇళ్ళు పూర్తి కావాల్సి ఉందన్నారు. ఇందులో జనవరి నెలకు సంబంధించి 29 ఇళ్ళకు ఇప్పటికే 20 పూర్తయ్యాయని, మిగిలినవి ఈ నెలాఖరుకు పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రత్యేకాధికారి వెంట ఎంపీడీఓ హరినారాయణ, పంచాయతీ కార్యదర్శి విజయకుమార్, ఏఓ అరవిందనాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఇళ్ళ నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజు, అధికారులు

చిరుధాన్యాల సాగు లాభదాయకం

గోపవరం : చిరుధాన్యాల సాగు రైతుకు లాభదాయకమని మండల ప్రత్యేకాధికారి, బద్వేలు ఏడీఏ ఎం.నాగరాజు పేర్కొన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా మంగళవారం గోపవరం రైతుభరోసా కేంద్రంలో చిరుధాన్యాల పంటల సాగు, ఉపయోగాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 23వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో చిరుధాన్యాల సాగుపై గ్రామసభలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఒక ఎకరానికి అవసరమైన నీటితో నాలుగు ఎకరాలు చిరుధాన్యాల సాగు చేయవచ్చని, దీంతో సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం చిరుధాన్యాలను శుద్ధి చేసే యంత్రాలు, సబ్సిడీతో విత్తనాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అరవిందనాయక్

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని ఓ ఐటీఐ కళాశాల సమీపంలో మంగళవారం ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కలసపాడు మండలం ఎగువ రామాపురం గ్రామానికి చెందిన నాయుడూరి శ్రీనివాసులు (50) పోరుమామిళ్ళలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. సుమారు మూడేళ్ళ క్రితం శ్రీనివాసులు తన భార్య అయిన లక్ష్మీదేవిపై అనుమానంతో ఆమెను హత్య చేశాడు. కేసు విచారణ కోర్టులో తుది దశలో ఉంది. సోమవారం కడప కోర్టులో వాయిదా ఉండగా వాయిదాకు కూడా హాజరుకాలేదని సమాచారం. శిక్ష పడుతుందేమోనన్న భయంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. అయితే మృతుని వద్ద ఉన్న ఓ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీఆర్ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా మృతునికి పిల్లలు, బంధువులు ఎవరూ లేకపోవడంతో మున్సిపల్ సిబ్బందితో ఖననం చేయించారు.